అంగవైకల్యానికి అందని వైద్యం

- ఐకేఆర్పీల సమ్మెబాటతో మానసిక పిల్లలకు చికిత్స కరువు
- భవిత సెంటర్‌ను ప్రారంభించాలని కోరుతున్న తల్లిదండ్రులు


మానసిక దివ్యాంగులు స్వాతి, సైదులు

మహబూబాబాద్ అర్బన్: సమాజంలో వేసే ప్రతి అడుగుకూ అంగవైకల్యం అడ్డుకారాదు. మనోధైర్యంతో ముందుకెళ్లాలనే యోచనతో దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో శిక్షనందిస్తున్నాయి. నిత్యకృత్యాలతోపాటు విద్య, స్పీచ్ థెరపీ, హోమ్ బేస్ ఎడ్యుకేషన్ వంటి మెలకువలు నేర్పిస్తున్నాయి. పుట్టుకతో చిన్న వయస్సులో వైకల్యం ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి భరోసా ఇస్తున్నాయి. అటువంటి ఐకేఆర్పీలు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెబాట పట్టారు.

జిల్లాలో 16 భవిత కేంద్రాల్లో సుమారు 220 మంది అంగవైకల్యం కలిగిన పిల్లలు ఉన్నారు. ప్రతి మంగళవారం భవిత కేంద్రాలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు వైద్యం, చదువు, ఆటలుపాటలు, ఫిజియోథెరపి చికిత్స అందిస్తారు. అదేవిధంగా పూర్తిస్థాయిలో వైకల్యం, మానసికంగా లేని పిల్లల ఇంటిని ఐకేఆర్పీలు సందర్శించి వారికి చదువుతోపాటు ఆటలు అందిస్తారు. ఐకేఆర్పీలు నిరవధిక సమ్మె డిసెంబర్ 6నుంచి చేస్తుండడంతో నాలుగు వారాలతో మానసిక దివ్యాంగులకు చికిత్స అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఐకేఆర్పీలు, వైద్యులు సరైన చికిత్స, ప్రతిరోజు వైద్యం అందిస్తేనే తమ పిల్లలు ఆరోగ్యవంతులుగా అవుతారని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఐకేఆర్పీలు తమను రెగ్యులరైజ్ చేయాలని, జీతాలు పెంచాలని చేపట్టిన సమ్మె దివ్యాంగులకు పాలిటశాపంగా మారింది. మానుకోట జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్‌నగర్ కాలనీకి చెందిన ముగ్గురు దివ్యాంగులు ఉన్నారు. వారికి రెండు వారాలుగా భవిత సెంటర్‌లో చికిత్స అందక ఇంటి దగ్గరే ఉంటున్నారు. స్వాతి పూర్తిస్థాయిలో నడవ లేదు. సైదులు మూగవాడు, పోలియో ఇప్పటికైన జిల్లా విద్యాశాఖ అధికారులు దివ్యాంగుల, మానసిక పిల్లల పరిస్థితిని అర్థం చేసుకొని, ఫిజియోథెరపి చికిత్స అందించి మళ్లీ తిరిగి భవిత సెంటర్‌ను ప్రారంభించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రైవేట్‌లో రూ.300 ఖర్చు అవుతుంది



ఐకేఆర్పీ ఉద్యోగులు జీతాలను పెంచాలని సమ్మె చేస్తున్నారని తెలిసింది. డిసెంబర్ నుంచి తమ పాపను భవిత సెంటర్‌కు తీసుకపోవడం లేదు. డాక్టర్లు కూడ రావడం లేదు. ఫిజియోథెరపి చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్తే రోజు రూ.300 ఖర్చు అవుతుంది. ప్రతి రోజు ఫిజియోథెరపి చికిత్స చేస్తేనే నరాలకు సరైన వైద్యం అందుతుందని డాక్టర్లు చెబుతున్నారు.

– బొశెట్టి సరిత, మానసిక దివ్యాంగురాలి తల్లి, మానుకోట

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్

నెహ్రూసెంటర్: సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, సివిల్ సప్లై యూనియన్ జిల్లా కార్యదర్శి వంకాయలపాటి జక్కరయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, కూలీరేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల శ్రమదోపిడీకి గురిచేయడం సరికాదని వారి సమస్యల పరిష్కారానికి కమిషనరేట్‌లో వినతిపత్రాలు ఇచ్చిన నేటికి పరిష్కారం కాలేదన్నారు. హమాలీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికి జీఓ విడుదల చేయాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మె తప్పదన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వెంకన్న, తిరుపతి, రవి, భూమయ్య, లింగయ్య, అజయ్, సాయి, అశోక్, సరిత, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


నెహ్రూసెంటర్: ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

నూతన ధరల ఒప్పందాన్ని అమలు చేయాలి

గార్ల: సివిల్ సప్లై, జీసీసీ హమాలీ కార్మికుల ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన నూతన ధరల ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గార్లలోని సివిల్ సప్లై గోదాం ఎదుట హమాలీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి వీరస్వామి మాట్లాడారు. హమాలీ వర్కర్స్ యూనియన్ జేఏసీ పిలుపు మేరకు గోదాం ఎదుట ధర్నా చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఇస్తారి, సర్వయ్య, ముత్తయ్య, అంజి, సునీల్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగంతో రోడ్డు ప్రమాదాలు

తొర్రూరు: ఒకరి నిర్లక్ష్యం మరొకరి ప్రాణాలను బలిగొంటుందని ఎంవీఐ సాయిచరణ్, వెంకట్ రెడ్డి అన్నారు. తొర్రూరు డీఎం పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని డిపో గ్యారేజీ ఆవరణంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా తొర్రూరు డీఎం పద్మావతితో కలిసి వారు మాట్లాడారు. మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనాలను నడపడం, రాత్రి సమయంలో వాహనాలను రోడ్డు పక్కనే పార్కింగ్ చేయడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు సేఫ్టీ పాటిస్తూ ఓపికతో జాగ్రత్తగా తమ విధులు నిర్వర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఎస్టీఐ రజిత రెడ్డి, ఎల్‌హెచ్ గోపాల్ రెడ్డి, ఏడీసీలు, సూపర్ వైజర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎం పద్మావతి

ఆనందోత్సాహాలతో 'న్యూ ఇయర్'

నూతన సంవత్సరం 2025 రాకను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా దేవాలయాలు, చర్చిల్లో స్వాగత వేడుకలను మంగళవారం రాత్రి, బుధవారం కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సర వేడుకలను ప్రజలు జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్


గార్ల: ముగ్గులు వేస్తున్న మహిళలు


డోర్నకల్: ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు


మరిపెడ రూరల్: వీరారంలో కేక్ కట్ చేస్తున్న యువతులు


మహబూబాబాద్ రూరల్: శ్రీసాయి మందిరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


మరిపెడ రూరల్: ఉల్లెపల్లిలో వేడుకల్లో పాల్గొన్న మహిళా కూలీలు


కురవి: ముగ్గు వేస్తున్న మహిళ


కేసముద్రం: చర్చిలో న్యూ ఇయర్ వేడుకలు


పెద్దవంగర: కేక్‌కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

24వ రోజుకు చేరిన ఉద్యోగుల దీక్ష


చెవిలో పువ్వుతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మహబూబాబాద్: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వీరన్న రాష్ట్ర నాయకుడు ఖాదర్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 24వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి పే స్కేల్‌ను అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను రద్దు చేయాలి

మహబూబాబాద్ రూరల్: మత్తు పదార్థాల క్రయ విక్రయాలను అరికట్టాలని, బెల్టు షాపులను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు రావుల రాజు, సమ్మెట రాజమౌళి మాట్లాడుతూ.. పట్టణంలో మత్తు పదార్థాలు, మద్యం బెల్ట్ షాపుల ద్వారా యువత రోజురోజుకు చెడు వ్యసనాలకు అలవాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చీపిరి యాకయ్య, దేవత్ హేమనాయక్, చాగంటి భాగ్యమ్మ, తోట శ్రీనివాస్, ఇల్లుటూరి లాలయ్య, పులుగుజు వెంకన్న, పంజాల ఉపేంద్ర, తేలూరి వీరభద్రం, నూనె శ్రీనివాస్, రేఖ దేవేందర్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


గార్ల: శబరిమలకు వెళ్తున్న మాలధారులు

గార్ల: హరిహరసుతుడైన అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమం గురుస్వామి వెంపటి దుర్గారావు ఆధ్వర్యంలో గార్ల లక్ష్మినారాయణస్వామి దేవాలయంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇరుముడి అనంతరం దేవాలయం నుంచి గార్ల నెహ్రూసెంటర్ మీదుగా అయ్యప్పస్వాములు ఊరేగింపు నిర్వహిస్తుండగా గార్ల పట్టణం అంతా అయ్యప్ప నామస్మరణలతో మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు విజయరాముడు, కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వీరభత్తిని రాము, అరుణ్, రమేశ్, రవీందర్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామంలో అయ్యప్ప మాలధారులు బుధవారం చేపట్టిన అయ్యప్పస్వామి నగర సంకీర్తనలో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అయ్యప్ప స్వామి పంచలోహ ఉత్సవ విగ్రహంతో వాడవాడలా బ్యాండు మేళాల మధ్య ఊరేగించారు.

మాజీ ఎంపీ కవిత జన్మదిన వేడుకలు


మహబూబాబాద్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు


గార్ల: వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు.

– సాక్షి నెట్‌వర్క్


కురవి: వీరన్న సన్నిధిలో..

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమదూరు గ్రామ పంచాయతీలో పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కార్మికురాలు సంకినేని ఎల్లమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు గుండాల సోమనర్సయ్య అన్నారు. బుధవారం ఆమె చిత్రపటానికి జీపీ కార్మికుల యూనియన్ పక్షాన నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

కురవి: సీరోలు మండల కేంద్రానికి చెందిన ముడుసు విజయ్ బాబు(36) తన వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ముడుసు విజయ్‌బాబు తన సొంత భూమిలో పొలం గట్లు చెక్కేందుకు వెళ్లాడు. గెట్లు చెక్కుతుండగా వ్యవసాయ బావి అంచుకు వెళ్లి కాలు జారి బావిలో పడిపోయాడు. విజయ్‌బాబు కి ఈత రాకపోవడంతో అందులోనే మునిగి మృతి చెందాడు. బావి వద్ద పనిచేస్తున్న విజయ్‌బాబు ఎంతకు రాకపోయేసరికి పొలం పక్కన ఉన్న ముడుసు వీరన్న, సుకుమార్‌లు బావి వద్దకు వెళ్లిచూడగా బావిలో తేలుతూ కన్పించాడు. బావిలోని మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మృతదేహాన్ని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రిలోని మార్చురీకి పంపించారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

దంతాలపల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉత్తం సోమయ్య(65) అనే వ్యవసాయ కూలీ మద్యానికి బానిసై భార్యతో పలుమార్లు గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో డిసెంబర్ 26న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో సోమయ్య ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తట్టుపల్లి గ్రామంలో ఒకరు..

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామానికి చెందిన బోనాల కళమ్మ(30) చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది డిసెంబర్ 20న ఇంటి వద్ద కట్టెల పొయ్యి మీద వేడి నీళ్లు వేడి చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె వేసుకున్న దుస్తువులకు మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈమేరకు మృతురాలి తమ్ముడు దాసరి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో ఊరంతా నూతన సంవత్సర వేడుకల్లో ఉండగా ఓ ఇంట్లో విషాదం నెలకొంది. గ్రామంలో పేద దళిత కుటుంబానికి చెందిన కన్నెకంటి రమేశ్(30) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుకతోపాటు మూడేళ్ల కుమార్తె సాహితి ఉండగా నాలుగు రోజుల క్రితం భార్య రేణుక మరోపాపకు జన్మనిచ్చింది. కళ్లు కూడా తెరవని పసిగుడ్డు తండ్రిని కోల్పోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి సతీమణి..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు దివంగత సింగు నర్సయ్య సతీమణి సత్తెమ్మ (95) బుధవారం ఉదయం తమ స్వగృహంలో మృతిచెందారు. ఆమె మృతికి గాంధేయ నిర్మాణ సంస్థల అధ్యక్షుడు జీవీ.సుబ్బారావు, కార్యదర్శి రంగారావు, భువనగిరి రవీంద్ర గుప్తా, సాదుల శ్రీనివాస్, బి.విజయసారథి, సీపీఎం, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు సోమయ్య, బి.అజయ్ సారథిరెడ్డి, తదితరులు సంతాపం తెలిపారు.

కుర్చీల వితరణ

బయ్యారం: మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత జన్మదినం సందర్భంగా బయ్యారం ఎస్సీ కాలనీ, గంగ బజారు, ఉప్పలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు కుర్చీలు వితరణ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, శ్రీకాంత్‌నాయక్, ఏనుగల ఐలయ్య, వజ్ర భద్రయ్య, బి.లక్ష్మణ్‌నాయక్, బి.మురళీనాయక్, బి.సంపత్, యాకయ్య, జగన్, శ్రీనివాస్, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.


కుర్చీలు అందజేస్తున్న నాయకులు

6 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం, 60కిలోల పటిక పట్టుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి ఒక ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి బుధవారం రాత్రి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు రైళ్లలో తీసుకువచ్చిన నల్లబెల్లం, పటిక బస్తాలను మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని పలు గ్రామాలు, తండాలకు తరలిస్తున్నారని సమాచారం వచ్చినట్లు తెలిపారు. ఈక్రమంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించగా 6క్వింటాళ్ల నల్లబెల్లం, 60కిలోల పటిక లభ్యమైందని, ఇద్దరు యువకుల్లో ఒకరు పట్టుబడగా మరొకరు పరారయ్యారన్నారు. పట్టుబడిన ఆలకుంట్ల వెంకటేష్, పరారైన ముజ్జుపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి ఒక ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

క్లుప్తంగా

అనంతాద్రిలో భక్తుల పూజలు



మహబూబాబాద్ రూరల్: నూతన సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతాద్రి జగన్నాథ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



డోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరంసోత్ జగదీష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, పట్టణ అధ్యక్షుడు సుమేర్‌చంద్‌జైన్, నాయకులు మాదా శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, శీలం శ్రీను పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన సోషల్ మీడియా ఇన్‌చార్జ్



మరిపెడ రూరల్: హైదరబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మండల బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పంట్ల వంశీ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశాడు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ఎంతో మేలుదాయకమని తిరుమల తిరుపతి దేవస్థాన ఉభయ వేదాంత ప్రవర్తకులు శ్రీమాన్ కేకే.పరకాలన్ స్వామివారు అన్నారు. పట్టణంలోని సనాతన పురాతన క్షేత్రమైన శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో బుధవారం తిరుప్పావై సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో కండ్లకుంట్ల శ్రీనివాసాచార్యస్వామి, వేంకటనృసింహాచార్యస్వామి, దాసశేషాచార్యస్వామి, భాగవతుల వంశీకృష్ణమాచార్యస్వామి, ధనుర్మాస ఉత్సవ గోష్ఠి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి

తొర్రూరు: భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, అచ్చిరెడ్డి, పెద్దగాని సోమయ్య, బాలకృష్ణ, ధరావత్ సోమన్న పాల్గొన్నారు.

'టెస్కాబ్' చైర్మన్‌ని కలిసిన ఉద్యోగులు



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావును రాష్ట్ర సహకార బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, నాగరాజు, రాజు, రమ్యశ్రీ, నీలిమ, హరి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

మరిపెడ రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి గ్రామానికి చెందిన జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్, మంజుల దంపతులను మాజీ ప్రజా ప్రతినిధులు బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుగులోతు సింధూరరవి దంపతులు, అరుణరాంబాబు దంపతులు, తేజావత్ శారదరవీందర్‌నాయక్ దంపతులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

కేసముద్రం: మండల కేంద్రంలోని స్థానిక సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు నర్సంపేట సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్ బుధవారం తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసముద్రం సబ్‌పోస్టాఫీస్ పనివేళల్లో కూడా, ఆధార్ నమోదు కేంద్రం పనిచేస్తుందని ఆయన తెలిపారు.